క్లుప్తంగా

ఏజీపీలుగా వేణుగోపాల్‌రావు, రఘురామయ్య




వేణుగోపాల్‌రావు రఘురామయ్య

చివ్వెంల : సూర్యాపేట జిల్లా కోర్టులో ల్యాండ్ అక్విజేషన్ రిఫామ్స్ ట్రిబ్యునల్ (ఎల్‌ఏఆర్‌టీ)కు సంబంధించి ప్రభుత్వం తరఫున కేసుల పరిష్కారం కోసం అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ అడ్వకేట్ టి.వేణుగోపాల్‌రావు నియమితులయ్యారు. జూనియర్ సివిల్ కోర్టులో ప్రభుత్వం తరఫున సివిల్ కేసుల పరిష్కారం కోసం అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కొణం రఘురామయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పంపిణీ



శేఖర్‌కు ఎల్‌ఓసీ కాపీ అందజేస్తున్న సూర్యకిరణ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కర్నాటి శ్రీను తన కూతురు శ్రీజ ఆపరేషన్ కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.50 వేలు మంజూరు చేయించారు. అయితే మంజూరుకు సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ కాపీని ఎమ్మెల్యే కుమారుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు మందుల సూర్యకిరణ్ మంగళవారం హైదరాబాద్‌లో శ్రీను కుటుంబీకులకు అందజేశారు. ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యేకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎస్‌సీల సేవలు అభినందనీయం

ఆత్మకూర్(ఎస్) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు డిజిటల్ సేవలు అందించడంలో కామన్ సర్వీస్ సెంటర్‌ల పాత్ర కీలకమని సీఎస్‌సీల మండల అధ్యక్షుడు తండ రమేష్ అన్నారు. కామన్ సర్వీస్ సెంటర్‌లు ప్రారంభించి 15 సంవత్సరాలు అయిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాలు, తండాల్లోనూ 20 రకాల డిజిటల్ సేవలతో ప్రజల మన్ననలు పొందామన్నారు. సీఎస్‌సీలతో రాబోవు రోజుల్లోనూ మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ నిర్వాహకులు కస్తూరి నాగరాజు, ధరావత్ హరిప్రసాద్, లింగయ్య, అభినవ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

నూతనకల్ : చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పులుసు వెంకన్న మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, బిక్కి బుచ్చయ్య, కొంపెల్లి రాంరెడ్డి, పులుసు లింగమల్లయ్య, బత్తుల విద్యాసాగర్, తూడి లింగారెడ్డి, గాడ్డుల లింగరాజు, బత్తుల సాయిలుగౌడ్, మహేశ్వరం మల్లికార్జున్, రేసు వెంకటేశ్వర్లు, బత్తుల విజయ్, రామసాని మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సామర్థ్యాలకు అనుగుణంగా లక్ష్యాన్ని ఎంచుకోవాలి

నూతనకల్ : విద్యార్థులు తమ శక్తి సామర్థ్యానికి అనుగుణంగా లక్ష్యాన్ని ఎంచుకోవాలని మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ బండపల్లి సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయమేరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్మీ విశిష్టతను వివరించారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే జీవితంలో స్థిరపడే విధంగా క్రమశిక్షణతో కూడిన విద్యను పొందాలని సూచించారు. దేశ సేవ చేయడం కోసం ప్రతి విద్యార్థి ముందుండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని పాశ్యానాయక్ తండా గ్రామ శివారులో మంగళవారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావతు లింగా తన ఆవును మేత కోసం వ్యవసాయ పొలం వద్దకు తోలుకెళ్లాడు. ఆవు మేతమేస్తూ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

అరకొర వసతుల్లో అంగన్‌వాడీలు

- చాలా గ్రామాల్లో అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్న వైనం
- ఆట వస్తువులు లేక చిన్నారులకు అందని ఆటాపాటల బోధన
- పౌష్టికాహారం పంపిణీపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సూర్యాపేట రూరల్ : పిల్లలకు బాల్యం నుంచే ఆట, పాటలతో చదువుపై ఆసక్తి పెంచడంతోపాటు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీలను ఏర్పాటు చేసింది. అయితే వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో సమస్యలు వెంటాడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యా బోధన, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీని పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన కేంద్రాలను తనిఖీ చేయడంలో అలసత్వం వహిస్తుండడంతో అర్హులైన వారికి నష్టం జరుగుతోందని ఆయా గ్రామాల లబ్ధిదారులు చెబుతున్నారు. అంతేకాక చాలా చోట్ల టీచర్లు సమయపాలన పాటించడం లేదని, కొన్ని చోట్ల సిబ్బంది కొరతతో కేంద్రాలను తూతూమంత్రంగా నడిపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కేసారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం

ఆట వస్తువులేవి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్య అందించాల్సి ఉండగా.. పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులే కరువయ్యాయి. జారుడు బల్లలు తదితర పరికరాలను ప్రభుత్వం సమకూర్చాల్సి ఉంది. కానీ అవేవీ ఇవ్వకపోవడంతో కేంద్రాల్లో పిల్లలను ఆటలు ఆడించలేకపోతున్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ టీచర్లు సొంత డబ్బులతో ఆట వస్తువులు కొనుగోలు చేసి పిల్లలతో ఆటలు ఆడిస్తున్నారు.

మండలంలో ఇలా..

సూర్యాపేట మండలంలోని మూడు సెక్టార్ల పరిధిలో 61 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 5 మినీ అంగన్‌వాడీలు, 56 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 18 కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి సరైన స్థలం కూడా ఉండడం లేదు. ఒక వేళ స్థలం ఉన్నా ఆట వస్తువుల కొరతతో ఆటపాటలతో కూడిన బోధన అందడం లేదు. బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ కూడా సరిగా జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పౌష్టికాహారం పంపిణీని పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచే ఆగిపోయాయి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై ఓ అధికారిని వివరణ కోరగా.. ఆట వస్తువులు ప్రభుత్వం నుంచే రావడం లేదని తెలిపారు. దీంతో ఉన్న వాటితోనే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పుతున్నామని చెప్పారు. ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భానుపురి : కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల నుంచి రేషన్ కార్డులు జారీ చేయకపోవడం వల్ల లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నూతనంగా పెళ్లయిన దంపతులకు ఏ ప్రభుత్వ పథకం అందక చాలా దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీలో ఆలస్యం చేయొద్దని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యుడు నిమ్మల ప్రభాకర్, కౌన్సిల్ సభ్యులు పి.కృష్ణ, కిట్టు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

తుంగతుర్తి : పండ్ల తోటలలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సంగారెడ్డి సీనియర్ శాస్త్రవేత్త సుచిత్ర అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి చెందిన తోటలను పరిశీలించి మాట్లాడారు. కొంకన్ బహడోలి అనే నేరేడు రకంలో పండ్ల దిగుబడిని పెంచడానికి తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మామిడి తోటలో జాగ్రత్తలను తెలియజేశారు. ఆయిల్‌పామ్ సాగులో సమతుల ఎరువుల యాజమాన్యాన్ని ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య, తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి స్రవంతి, సాంకేతిక ఉద్యాన అధికారి కె.జగన్, రైతు రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో వెలుగు చూసిన అక్రమాలు

- రూ.3.83 లక్షలు దుర్వినియోగం
- రికవరీకి ఆదేశించిన డీఆర్‌డీఓ



సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఓ, అడిషనల్ డీఆర్‌డీఓ

చివ్వెంల : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో అక్రమాలు వెలుగుచూశాయి. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం ఏప్రిల్ వరకు రూ.5.79 కోట్ల వ్యయంతో గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో చదివి వినిపించారు. తప్పుడు మస్టర్లు రాయడం, పోర్జరీ సంతకాలు చేయడం, పని చేసిన రోజుల కంటే ఎక్కువ రోజులు పనిచేసినట్లు చూపించడం, మొక్కలు నాటకుండానే నాటినట్లు బిల్లులు చేయడం, ఫీడర్ చానల్ పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు రాసి బిల్లులు పొందడంతో రూ.3.83 లక్షలు దుర్వినియోగమైనట్లు తనిఖీ బృందం సభ్యులు గుర్తించి అధికారులకు వివరించారు. అత్యధికంగా బి.చందుపట్ల గ్రామంలో రూ.75 వేల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. గ్రామాల్లో పనులకు సంబంధించి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష, అంబుడ్స్‌మెన్ లచ్చిరాం నాయక్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎస్‌ఆర్‌పీలు సాంభశివరావు, సురేష్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి లింగారెడ్డి, విజిలెన్స్ మేనేజర్ ఆశాకుమారి, ఏపీఓ నాగయ్య, ఈసీ జ్యోతి, డీఆర్‌పీలు నాగయ్య, వాసు, ఏకలక్ష్మి, వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తిని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే మందుల సామేల్



వెలుగుపల్లి శివారులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెలుగుపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గం గత ప్రభుత్వాల హయాంలో వెనుకబాటుకు గురైందని తెలిపారు. గత పాలకులు రుద్రమ చెరువును రిజర్వాయర్‌గా మారుస్తామని చెప్పి ఓట్లు దండుకొని ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రుద్రమ చెరువు పక్కనే ఉన్న 200 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశ్రమల స్థాపనకు యోగ్యంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో ఉన్న సుమారు రెండు మూడు వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. తుంగతుర్తి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఇటీవల కలిసి నియోజకవర్గ పరిస్థితిని వివరించానని తెలిపారు. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. అదేవిధంగా రుద్రమ చెరువును రిజర్వాయర్‌గా మార్చడానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇటీవల సంప్రదించానని, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు, తుంగతుర్తిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎస్సారెస్పీ కాలువలకు లైనింగ్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. త్వరలో తుంగతుర్తి క్యాంప్ కార్యాలయంలో వారానికి రెండు రోజులు ఉండి ఈ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఆర్‌ఐ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, నల్లు రామచంద్రారెడ్డి, దాయం ఝాన్సీరెడ్డి, పెద్దబోయిన అజయ్‌కుమార్, కొండ రాజు, కృష్ణ, నాగయ్య, సైదులు, శంకర్, మల్లయ్య, మల్లేష్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను నివారించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

నాగారం : కోతుల బారి నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరుతూ టీపీసీసీ అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞానసుందర్ మాట్లాడారు. వేరుశనగ, పెసర్లు, కందులు, మొక్కజొన్న, బొబ్బర్లు, కూరగాయలు తదితర పంటలను కోతులు ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. కోతులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే రైతులపై దాడి చేస్తున్నాయని అన్నారు. అంతేకాకుండా కోతులు ఇళ్లలోకి చొరబడి అన్నం, కూరలు తింటూ ప్రజలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరంగా మారుతోందని అన్నారు. ప్రభుత్వం కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకొని, పంటలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంటకండ్ల అశోక్‌రెడ్డి, పాశం యాదవరెడ్డి, గుంటకండ్ల ముకుందారెడ్డి, కొనిరెడ్డి మోహన్‌రెడ్డి, కడారి సోమయ్య, కన్నెబోయిన హరీష్, చిప్పపల్లి ఉపేందర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

మద్దిరాల : ఆటో, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 5వ మహాసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, జిల్లా కమిటీ సభ్యుడు నాగెల్లి రామనర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను కార్మికులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో 20లక్షలకు కార్మికులు ఆటో మోటార్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. వీరికి నేటి వరకు భద్రతో కూడిన సంక్షేమ బోర్డు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం ఈ నెల 21న ఇల్లందులో జరిగే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు వనం వెంకన్న, నాగన్న, పోతరాజు సతీష్, నరేష్, లింగరాజు, ప్రశాంత్, మహేష్, చరణ్, మనోజ్, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

తుంగతుర్తి : ఎన్నికల ముందు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. నేడు రేషన్‌కార్డు ఉన్నవాళ్లకు మాత్రమే రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల చేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచించి రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీనివాస్, తడకమళ్ల రవికుమార్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ

అర్వపల్లి : అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అడివెంల గ్రామంలో మంగళవారం సిబ్బంది ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తుండటంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యాదమ్మ, కరుణ, అంగన్‌వాడీ టీచర్ శతకోటి సరోజ, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని పలువురు అంగన్వాడీ టీచర్లు కోరారు. అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తగూడెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది లక్ష్మీబాయి, శారద, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సమోదును పెంచేందుకు అమ్మ మాట–అంగన్‌వాడీ బాట స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పస్తాల, లక్ష్మాపురం తదితర గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి రెండున్నర ఏళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బింగి మంజుల, కట్ట సుశీల, ఆయాలు నాగమ్మ, హేమలత, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ (ఎస్) : కోటపహాడ్‌లో బడిబాట నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆత్మకూర్(ఎస్) : 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటపహాడ్, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇంటి వద్ద ఉంచకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర, నీలమ్మ, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



నాగారం : పస్తాలలో..



అర్వపల్లి : అడివెంలలో..



తుంగతుర్తి : కొత్తగూడెంలో..

గురుకులాలు, వసతి గృహాలపై దృష్టి సారించాలి

అర్వపల్లి : గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పూలే అంబేడ్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గురుకులాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. నిరుపేదలు తమ పిల్లలను గురుకులాలు, వసతిగృహాలలో చదివిస్తుండగా వాటిలో విశాదకరమైన మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పించాలని కోరారు. ఆయన వెంట సమితి నాయకులు సురేందర్, వెంకన్న, నర్సింహ, వీరన్న, భద్రయ్య, పద్మ, సరస్వతి ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

నాగారం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని డీఎల్‌పీఓ కె.యాదగిరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగారంబంగ్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి మాట్లాడారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మురుగు గుంతల్లో నీరు నిలవకుండా చూడాలని సూచించారు. దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ స్ప్రే నిర్వహించాలని, నీటిగుంతలలో ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభన్‌బాబు, జీపీ సిబ్బంది నాగాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మునగాల : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మునగాలలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారని, కానీ నెలల తరబడి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉండగా ప్రభుత్వం ఇచ్చే ధర సరిపోక అదనపు భారం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కిన్నెర సరోజన, ఎల్.స్వప్న, జి.ధనమ్మ, మనీ, రంగమ్మ, అరుణ, సరోజన, కోటమ్మ పాల్గొన్నారు.

పశువుల యజమానులకు నోటీసులు

మునగాల : ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం, కలుషిత నీటి మూలంగా విష జ్వరాలు ప్రబలుతుండడంతో మంగళవారం మునగాల గ్రామపంచాయతీ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సర్వీసు రోడ్డు వెంట, వీధుల్లో పశువులను కట్టేసే వారికి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి ఎన్.భూపాల్‌రెడ్డి నోటీసులు అందజేశారు. అదేవిధంగా ఇంటి ఆవరణ, వెలుపల పెంటదిబ్బలు, చెత్తకుప్పలు పోసే వారికి హెచ్చరికలు జారీ చేశారు. వీధుల్లో పెంటకుప్పలు పోయొద్దని, పశువులను కట్టివేయొద్దని హెచ్చరించారు. అనంతరం సర్వీస్ రోడ్డు వెంట ఉన్న అపరిశుభ్ర ప్రాంతాల్లో సిబ్బంది సాయంతో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నోటీసులు అందజేస్తున్న ఎంపీఓ, తహసీల్దార్

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

భానుపురి : పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపాడు బీసీ గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థిని సరస్వతి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జనరల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా జ్వరం వస్తున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామ గ్రామాన పీర్ల ఊరేగింపు

అర్వపల్లి : మండలంలోని రామన్నగూడెం, బొల్లంపల్లి, కాసర్లపహాడ్, కొమ్మాల తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపును మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామన్నగూడెం వద్ద పీర్లకొట్టం ఎదురుగా అగ్నిగుండాలు ఏర్పాటుచేసి వాటి చుట్టూ తిరుగుతూ అలావా ఆడారు. అలాగే తెల్లవారుజామున అగ్నిగుండాల వద్ద నిప్పులపై నడిచారు. ఈ కార్యక్రమంలో ముజావర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు.



రామన్నగూడెంలో అగ్నిగుండం వద్ద పీర్ల ఊరేగింపు



అర్వపల్లిలో..



బొల్లంపల్లిలో..